'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

తెలంగాణమా పద పోదాం.. నల్లగొండకు!

డాక్టర్ ఆంజనేయ గౌడ్

నదిలో న్యాయం కోసం నిప్పుల దారిలో నిన్నంతా నడిచింది తెలంగాణ. ఊరూరా ఉద్యమాలు పండించి, ప్రజారాశులను పోరు దారిలో హోరు జాతరలా మార్చిన నాయకుడు కేసీఆర్. గులాబీ మేఘ గర్జన కాలంలోనే కాదు, ప్రభుత్వంలో ఉన్నప్పుడు కేసీఆర్ సర్కార్ విశ్రమించక, నదిజలాల కోసమే ఒళ్లొంచింది. రెండు జీవనదులపై కాంగ్రెస్, టీడీపీ పాలకులు నిర్మించిన వంచన వంతెనలు, తరలించుకుపోయిన నీటి సిరుల లెక్కలు లోతుగా అర్థం చేసుకున్నాకే హరిహర బ్రహ్మాదులు ఎదురైనా రాష్ట్ర సాధన లక్ష్యం విడిపెట్టే ప్రసక్తే లేదని గీత గీసి బరిలోకి దిగిన ఉద్యమ పార్టీ బీఆర్ఎస్.

రెండు దశాబ్దాలకు పైబడి ప్రజల బలంగా, దళంగా నేల హక్కుల కోసం నిలబడి ఎన్నో శక్తులతో హోరాహోరీగా తలపడుతున్న గులాబీ పార్టీకి అధికారం ఊతకర్రే కానీ, అంతిమ పరిష్కారం కోసం ఆరాటపడే ఆదెరువు ఎన్నటికీ కాజాలదు. ఈ నేల నొప్పులకు శాశ్వత పరిష్కారం కనుగొనేందుకు పదేండ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో సాహసోపేత పాలనా చర్యలు తీసుకున్నది. రాష్ట్ర పోరులో ఎలాగైతే నిందలను, శత్రువులనూ పోగేసుకుందో, అధికార పార్టీగా కూడా కేంద్రంతో, పక్క రాష్ట్ర ప్రభుత్వంతో పోరాడక తప్పలేదు. రాష్ట్ర హక్కుల కోసం ఏ బలవంతుడితో ఘర్షణ ఎదురైనా వెన్ను చూపింది లేదు. రవ్వంత రాష్ట్ర భవితవ్యం పణంగా పెట్టిందేలేదు. చరిత్ర కొందరికి పోరాటమే కిరీటంగా తొడుగుతుందనడానికి కేసీఆర్‌కు మించిన ఉదాహరణ మరొకటి ఉండదు. రాష్ట్ర సాధన కోసం, సాధించుకున్న రాష్ట్రానికి సుస్థిరాభివృద్ధి సాకారం కోసం రెండు దశాబ్దాల పాటు ప్రతి మలుపులో సమరమే శ్వాసగా అడుగులు వేయక తప్పలేదు. సింగరేణి బొగ్గు గనులపై అదానీ వాలకుండా, విద్యుత్తు వ్యవస్థ ప్రైవేట్ పెట్టుబడిదారుల పరమవ్వకుండా, నీటి సిరులు రాష్ట్రం దాటిపోకుండా ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఎన్ని సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నారో.

> గులాబీ పార్టీ గుండె నిండా తెలంగాణ నేలతల్లే నెలవైన సత్యం మంచిని దీవించే గుణమున్న బుద్ధిజీవులందరికీ తెలిసిందే. తెలంగాణకు నొప్పి కలిగించే చర్యలపైనే చిచ్చరపిడుగులా తిరగబడే సహజ స్వభావం గులాబీ దళానిది. అలాంటిది ఏకంగా రాష్ట్ర భవితవ్యానికి కేంద్ర, రాష్ట్ర సర్కార్‌లు ముప్పును నిర్మిస్తుంటే కేసీఆర్ సైన్యం కండ్లు మూసుకొని మౌనరాగం ఆలపిస్తుందా? కృష్ణా నదిపై ప్రాజెక్టులను కేంద్రం అధీనంలోని కేఆర్ఎంబీకి అప్పగించడమంటే నీటి హక్కుల కోసం పోరాడి ఒరిగిన అమరులను అవమానించడమే కదా?

నాగేటిసాలల్ల మళ్లీ నాటి బతుకులను తిరిగి తీసుకురావాలనే కుట్రలు పన్నడమే కదా! మొదటి కేఆర్ఎంబీ నీటి వాటా కేటాయింపులే అన్యాయమని, కేఆర్ఎంబీ-2 ద్వారా 50:50 కేటాయింపుల కోసం నిలదీస్తుంటే, నిర్మించుకున్న, నిర్మాణంలో ఉన్న మన జల దేవాలయాలను శాసించే పెత్తందారీ ఎత్తులు సమరశీల తెలంగాణ సహిస్తుందా? విభజన సమస్యలతో వేధించి, ఏ చేదోడూ అందించక కవ్వించి.. కాళేశ్వరం, పాల మూరుకు హోదా అడిగితే మొండిచెయ్యి చూపించి పదేండ్లు గులాబీ ప్రభుత్వానికి పంటికింద రాయిలా మారింది మోదీ సర్కార్. ఇప్పుడు మరు గుజ్జు రాష్ట్ర సర్కార్ భుజంపై తుపాకీ పెట్టి, తెలంగాణ నీటి వాటాపై రాబందులా రెక్కలు చాపాలని కుయుక్తులు పన్నుతున్నది. నీటికి కన్నీటికీ మధ్య దశాబ్దాల పాటు పీకల్లోతులో మునిగి ఎన్నో అవస్థలు పడ్డ తెలంగాణ మళ్లీ హక్కులకు మరొక పెత్తందారీ కాపలా కావాలని కలలోనైనా కోరుకుంటుందా? తెలంగాణ భవితకు గోతులు తవ్వడమంటే కేసీఆర్‌తో చెలగాటమాడటమే. కేఆర్ఎంబీ సమావేశం మినిట్స్‌లో నగ్నంగా దొరికిన రేవంత్ రెడ్డి సర్కార్, బుకాయింపుల బరితెగింపులకు దిగినా, కృష్ణా నదిపై నిర్మించిన ప్రాజెక్టుల నిర్వహణను నారద సర్కార్‌కు అప్పగించేందుకు అంగీకరించిందనే సత్యం తేటతెల్లమైపోయింది.

ఈ కాంగ్రెస్, బీజేపీ సర్కార్ల కుట్రే మళ్లీ తెలంగాణ తేనెతుట్టెను కదిలించింది. ఇప్పుడు తెలంగాణ భక్తులకూ, పొలిటికల్ పెత్తందారీ శక్తులకూ పోరు అనివార్యం. కోటి ఎకరాల మాగాణమైన తెలంగాణను, మళ్లీ నీటి కోసం అడుక్కునే భిక్షగత్తెను చేస్తామంటే ఈ పోరాటాల గడ్డపై జన్మించిన ఏ బిడ్డ కూడా సహించడు. 'పుడితే ఒకటి, చస్తే ఒకటి అందుకొ తెలంగాణ జెండా.. రాజిగో.. మా రాజిగో' పాట్టి, పోరై మండి సాధించిన తెలంగాణలో మళ్లీ మిడతల దండు చొరబడితే, తెలంగాణ తిరగబడి తీరుతుంది. అందుకే 'రాష్ట్ర నలుదిక్కులూ.. నగారారిలో.. నల్లగొండ చేరుదారిలో' అంటూ ఈనెల 13న జరుగబోతున్న బీఆర్ఎస్ బహిరంగ సభ కోసం సిద్ధమవుతున్నాయి. టీఆర్ఎస్ ఉద్యమ ప్రథమ వార్షికోత్సవాన్ని 2002 ఏప్రిల్ 27న నల్లగొండలో జన జాతరలా జరుపుకొంది. మళ్లీ 22 ఏండ్ల తర్వాత అదే నల్లగొండలో, ఆనాటి భావోద్వేగంతో రాష్ట్ర హక్కుల కోసం ప్రజాప్రభంజనమై కదం తొక్కబోతున్నది. కేసీఆర్ పిలుపందుకొని కదులుతున్న తెలంగాణ మళ్లీ దేశానికి తాజా సందేశం ఒకటి పంపించదలుచుకున్నది. ఈ గర్జన దళారులపై ఎంతమాత్రం కానేకాదు, తెలంగాణ హక్కులను గుప్పెట బంధించాలనే ఎత్తులేసే వారందరికీ చాలా స్పష్టంగా 'ఎన్నటికీ తెలంగాణ అలసిపోదు, అజాగ్రత్తగా అసలే ఉండదు' అనే సందేశం ఈ సభ ఇస్తుంది. కేసీఆర్ ఉన్నంత కాలం గులాబీ జెండా రెపరెపలను ఆపలేరనడం ఎంత వాస్తవమో, బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర సకల హక్కులకు రక్షణ దళమై గస్తీ కాస్తూనే ఉంటుందనేది కూడా అంతే చారిత్రక సత్యం.

తెలంగాణ తన సద్దిమూటల్లో హక్కుల పోరాటాన్ని తరాల పాటు సాదుకున్నది. రెండు కన్నుల్లో కృష్ణా, గోదారులను ఇముడ్చుకొని భవితవ్యానికి బాటలు పరుచుకున్నది. ఈ నేల ఎన్నో నినాదాల ఇటుకలు పేర్చుకొని, కేసీఆర్ అనే రక్షణ గోడను నిర్మించుకున్నది. ఎందరో యమకింకరుల్లాంటి నేతలతో తలపడి, బతుకంతా తండ్లాడి, తెలంగాణను తొవ్వనపడేసిన పోరుశిల్పి కేసీఆర్. నేడు మళ్లీ స్వరాష్ట్ర ఆత్మగౌరవం కోసం, హక్కుల రక్షణ కోసం ప్రజారాశుల ఉద్యమ ఉప్పెనగా మారుతున్నారు. కేసీఆర్ ఏ పిలుపునిచ్చినా, దానిలో తెలంగాణ బతుకుంటుందనే సత్యం జనరాశులందరికీ తెలుసు. తెలంగాణోడి జీవితం కోసం కోస ఎల్లేదాకా విడుపక కొట్లాడే కేసీఆర్ వెంట సకలజనులూ కదిలితీరడం ఖాయం. అమృతం కురిసిన రాత్రిలో నిప్పును ఊదేసే నీరుంటుందని సినారె అన్నట్టుగా, కేసీఆర్ తెలంగాణ ముప్పునకు ఎదురెళ్లే పరిష్కారం.

> నల్లగొండ సభ తెలంగాణ ఎన్నటికీ తలవంచదు అనే సందేశమై నిలబడుతుంది. అధికారం రావడం, పోవడం రాజకీయ పార్టీకి వన్నె తెచ్చిపెట్టడు అనే అవగాహన బీఆర్ఎస్ పార్టీ ప్రతి కార్యకర్తకూ ఉంది. అందుకే ప్రాంతమే ప్రాణమైన నిత్య ప్రయాణంగా మలుచుకొని ముందడుగేస్తున్నది. 'మా నీళ్ల మాకేనని మర్లబడ్డ గానమా.. పోరు తెలంగాణమా..' పద పోదాం.. మన నల్లగొండకు.

వ్యాసకర్త: తెలంగాణ రాష్ట్ర సోషల్ ఫారెస్ట్ అథారిటీ మాజీ చైర్మన్

> మన దేశానికి మేలు చేసిన మహానుభావులను తలుచుకోవడంలో, గౌరవించుకోవడంలో తెలంగాణ సమాజంలో ఆద్యులు కేసీఆర్. సమర్థులు, త్యాగశీలురు, దివికేగినా, మన మధ్యలో ఉన్నా, ఎక్కడున్నా ఆ కీర్తి శిఖరాలను నేటి, రేపటి తరాల ముంగిట నిలుపగలిగే శక్తిసంపన్నులు కేసీఆర్. దేశాన్ని సుస్థిరం చేసిన దివంగత పీవీ గొప్ప ప్రజ్ఞ గురించి ఏకంగా ఏడాది పాటు సజీవంగా ఉంచడం తెలంగాణను నిలబెట్టిన కేసీఆర్‌కు మాత్రమే సాధ్యమైంది. అందుకు అక్షర సంతకం చేయడంలో 'నమస్తే తెలంగాణ' తోడయింది.

సంకల్పం.. సత్కారం

బహుశా ఆ ప్రభావం కూడా కేంద్రానికి ప్రేరణ అయి ఉంటుంది. ప్రధానమంత్రి మోదీ, ఎన్డీయే ప్రభుత్వం పీవీకి భారతరత్న ప్రకటించడం వెనుక కేసీఆర్ మనో ముద్ర, అఖండ సంకల్పం ఉండకపోదు. బహుముఖ ప్రజ్ఞాశాలి, అధ్యయన శీలి, సంస్కరణల పితామహుడు, బహు భాషావేత్త, కవి, పండితుడు, రచయిత అనే విశేషణాల మాల ప్రస్తావన పూర్తి కాకముందే పీవీ ఆటోమేటిక్‌గా ధ్వనిస్తారు. స్ఫురిస్తారు.

సీఎం టూ పీఎం దాకా ఆ పీఠాలకే వన్నె తెచ్చిన పీవీ.. ఆ రెండు పదవుల నడుమ పోషించిన విదేశాంగ శాఖ ప్రపంచానికి మన దేశాన్ని సరికొత్తగా పరిచయం చేసింది. ముఖ్యంగా మన తెలంగాణ రేపటి పౌరులు కచ్చితంగా ఈ విశేషాలు ఔపోసన పట్టాలి. ఎందుకంటే, మన తెలంగాణలోని కరీంనగర్, ఓరుగల్లు ముద్దుబిడ్డ కాబట్టి. మనో వికాసానికి, జీవన-జన జీవన నైపుణ్యానికి, నాయకత్వ నేర్పరితనం వంటి అనేక ప్రత్యేకతల సమాహారం తన 84 ఏండ్ల జీవన విధానం కాబట్టి. పాములపర్తి వెంకట నరసింహారావు సంక్షిప్తంగా పీవీ. మన తెలంగాణ ఠీవీ. కాకతాళీయంగా, యాదృచ్ఛికంగా లేదా దైవ బలం కాబోలు తెలంగాణ సాధకుడే ముఖ్యమంత్రిగా ఉన్నకాలంలో పీవీ శత జయంతి తలుపుతట్టింది. అప్పుడిక ఓ దండేసి, రెండు వాక్కులు చెప్పి ఊరుకునే బాపతా కేసీఆర్! కానేకాదు, ఎవరి దార్శనికత ఏమిటో, దేశానికి, సమాజానికి ఎవరెంత తోడ్పడ్డారో వర్తమాన నేతల్లో కేసీఆర్‌కు తెలిసినంతగా ఇంకెవరికి తెలుసు? అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కేకే సారథ్యంలో కమిటీ వేసి, 2020-21లో పీవీ శత జయంత్యుత్సవాలను ఈతి బాధలు, పచ్చి కరోనా పీడనల కాలంలోనూ సంవత్సరమంతా సుసంపన్నంగా జరిపారు. సమస మాజ కాంతుల దీప స్తంభం పీవీ ఘనతను 'లోకల్ టూ గ్లోబల్ నౌ ఏ డేస్'లో చాటించారు. ఢిల్లీలోనూ పీవీ శక్తియుక్తులను ప్రజ్వలింపజేశారు.

> ఎన్నో ఆటుపోట్లు, సంక్లిష్టతలను జయించిన పీవీ విజయాలు 1990 దశకంలో ఎంతో ప్రాముర్యం పొందాయి. ఆఖరికి బంగారు నిల్వలను దేశం తాకట్టు పెట్టే దుస్థితి నుంచి జాతి తలెత్తుకునే సంస్కరణల ఉపాయాలు రచించి, ఆచరించిన పీవీ నాయకత్వ పటిమను దశాబ్దాల తర్వాత మళ్లా మననంలోకి తెచ్చారు. అనేక సవాళ్ల వలయంలో మైనారిటీ ప్రభుత్వాన్ని పూర్తి కాలం ఐదేండ్లు కొనసాగించిన పీవీ మేధో సంపత్తి సత్తాను జనం మదిలో మరోసారి నిక్షిప్తం చేశారు. భూ, ఆర్థిక సంస్కరణల ఫలాల తాలూకు విశేషాలనూ, నవీన, నాగరిక సమాజంగా తీర్చిదిద్దిన సంగతులనూ ఏడాదంతా సాగిన నూరేండ్ల వేడుకల్లో కండ్లకు కట్టించారు.

అంతటి అత్యున్నత నాయకత్వ శిఖరం పీవీ పరమపదించినప్పుడు కాంగ్రెస్ పార్టీ ఘోరంగా అవమానించింది. తెలుగు, తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఆ పార్టీ చిదిమేసింది. కానీ, తెలంగాణ ప్రతీక కేసీఆర్ మాత్రం భవిష్యత్తు తరాలకు పీవీ త్యాగాలను స్మరణలో ఉంచారు. శతజయంతి ఉత్సవాలకు ముందే పీవీ కుమార్తె, విద్యావేత్త వాణిదేవిని ఎమ్మెల్సీగా పెద్దల సభకు పంపించి విశేషంగా ఆదరించారు కేసీఆర్. దక్షిణ భారత తొట్ట తొలి బాహుబలి భారత ప్రధానమంత్రి పీవీ నరసింహారావుకు భారతరత్న పురస్కారాన్ని 2021 జూన్ 28 నాటి శతజయంతి ఉత్సవాల ముగింపు వేడుక ఆకాంక్షించింది. ఇప్పుడా ఉబలాటం, ఆ మనోభీష్టం నెరవేరింది. తెలంగాణ మురుస్తోంది. తెలంగాణ మనసు నిండింది.



ఇల్లెందుల దుర్గాప్రసాద్
94408 50384

> దశాబ్దాల పాటు ప్రాజెక్టులను నిర్మించే చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ.. 36 ఏండ్ల పాటు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టును నిర్మిస్తే అది కూడా అసంపూర్తే. అట్లాగే 1984లో శంకుస్థాపన చేసిన కల్వకుర్తి ప్రాజెక్టును.. స్వరాష్ట్రం సిద్ధించాక 2014లో పనులు మొదలుపెట్టి.. 2017లో నిర్మాణం పూర్తి చేసుకున్నాం. భీమా, కోయిల్ సాగర్, నెట్టెంపాడు ప్రాజెక్టుల పరిస్థితి కూడా అంతే. వాటిని నాటి కాంగ్రెస్ ప్రభుత్వాలు అసంపూర్తిగా వదిలేస్తే.. ఆ ప్రాజెక్టులను పూర్తి చేసి, స్వరాష్ట్రంలో సాగు, తాగుజలాలు అందించింది కేసీఆర్ సర్కారే.

పాలమూరు ఆలోచించాలె

మేడిపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి
96151 46666

ఉమ్మడి పాలనలో జలయజ్ఞాన్ని ధన యజ్ఞం చేసి ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టు తలపెట్టి తట్టెడు మన్ను తీయకుండా కాంట్రాక్టర్లకు అడ్వాన్స్ పేమెంట్లు ఇచ్చిన ఘన చరిత్ర కాంగ్రెస్ పార్టీది. పోతిరెడ్డిపాడుకు పొక్క పెట్టి నీళ్లు తీసుకుపోతుంటే పదవుల కోసం పెదవులు మూసుకున్నారు ఆనాటి కాంగ్రెస్ నాయకులు. తెలంగాణ ప్రాంతానికి ఇంత అన్యాయం జరుగుతున్నా, మంత్రి పదవుల కోసం పూలు చల్లి, కొబ్బరికాయలు కొట్టి, హారతులిచ్చి పేపర్‌లో పుంఖానుపుంఖాలుగా వ్యాసాలు రాసి, అధిష్ఠానం మెప్పుపొందే ప్రయత్నం చేశారు. ఇక్కడ మనం గుర్తుంచుకోవాల్సింది ఆనాడు కేంద్రంలో కూడా కాంగ్రెస్సే అధికారంలో ఉన్నదనే విషయం.

రాష్ట్రం సిద్ధించినంక కృష్ణా నదిపై అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేసుకొని కేంద్ర ప్రభుత్వంపై ప్రతి నీటిబొట్టుకు యుద్ధం చేసి.. సాగు, తాగుజలాల కొరత లేకుండా చేసింది కేసీఆర్ సర్కారే. అంతేకాదు ఆనాటి కేంద్ర ప్రభుత్వం విభజన సమయంలో తెలంగాణలో నిర్మించే ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చి, ఆ హామీకి చట్టబద్ధత కల్పించలేదు. కానీ, ఆంధ్రా ప్రాంతంలో నిర్మించే పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చే అంశానికి చట్టబద్ధత కల్పించి ఓ రకంగా తెలంగాణను వంచించింది. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం పొరుగు రాష్ట్రాలలో నిర్మించే ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇస్తూ తెలంగాణకు అన్యాయం చేస్తున్నది. అయినా కేసీఆర్ సర్కార్ వెనుకడుగు వేయలేదు. మోదీ సర్కార్ రూపాయి ఇవ్వకపోయినా పాలమూరు, రంగారెడ్డి జిల్లాల్లో 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతలను దాదాపు 80 శాతం పూర్తి చేసింది కేసీఆర్ ప్రభుత్వం. కానీ, తాజాగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పనులను నిలిపివేయడమే కాకుండా కేంద్రానికి అప్పజెప్పేందుకు అంగీకరించింది.

> ఒక నాడు నీటి చుక్క కోసం కంట నీరు పెట్టిన ప్రాంతం.. 'పల్లె పల్లెన పల్లేర్లు మొలిసే నా పాల మూరులోన..' అని ప్రసిద్ధ కవులు గొంతెత్తి పాడిన ప్రాంతం పాలమూరు. అట్లాంటి ప్రాంతంలో గత పదేండ్లు తాగు నీళ్ల రుచి చూడగలిగినం. ఒక పంట పండించేందుకు వర్షపు చుక్క కోసం ఆకాశం వైపు చూసిన చోట.. కేసీఆర్ పుణ్యమాని రెండు పంటలను సమృద్ధిగా పండించారు రైతన్నలు. కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత దుశ్చర్యల వల్ల మళ్లా ఆ పాత రోజులు తిరిగి వచ్చి కంటశోశనే మిగిలిస్తున్నది.

నిందల వెనుక నిన్నటి బానిసత్వం

పాయింట్ బ్లాంక్

సవాల్ రెడ్డి

> ఈ భూగోళం మొత్తం మీద తెలంగాణ ఉద్యమం, ఉద్యమ నాయకుల మీద వేసిన నిందలు, జరిగినంత దాడి బహుశా మరెవరి మీదా జరిగి ఉండదు. తెలంగాణ అనే పదాన్ని కూడా జీర్ణించుకోలేని సమైక్యమూకలు పచ్చ పత్రికలై, టీవీలు, సోషల్ మీడియా ఉన్మాదులై ఉద్యమం పొడవునా నిందలు వేసి దాడులు జరుపుతుంటే; ఆ కాలంలో వారి పంచనపడి బతికిన బానిసలు వాటినే జనంలోకి మోసేవారు. ఆ దాడులకు కొనసాగింపే అసెంబ్లీ సమావేశాల్లో కనిపించింది.

> ఏనాడూ జై తెలంగాణ అనని ఆ బానిసలే మన కర్మకొద్దీ ఏలికలై దురహంకారంతో, రాజకీయ దుగ్ధతో ఉద్యమ నాయకుల మీద నోరు చేసుకుంటున్నారు. సీమాంధ్ర మూకలు ఆనాడు ఏ నిందలైతే వేశారో.. అవే నిందలు ఇవాళ వీళ్ల నోట్లో చిలకపలుకులై బయటపడుతున్నాయి. వారి ఆరోపణలు మూడండి. కేసీఆర్ దీక్ష రోజున రంగధాంపల్లిలో హరీష్‌రావుకు అగ్గిపుల్లలు దొరకలేదట. అంతా నాటకమట. దాని కారణంగానే విద్యార్థులు బలిదానాలకు పాల్పడ్డరట. ఇదీ తెలంగాణ ఉద్యమం గురించి సదరు మంత్రుల అవగాహన. విద్యార్థులు, యువకుల బలిదానాల పవిత్రతకు ఆ మంత్రులు ఆపాదించే వక్రభాష్యం. ఆ మహోన్నత త్యాగాలకు వాళ్లిచ్చే గౌరవం.

అసలు సదరు మంత్రులు చెప్పిన ఆ సంఘటన ఎలాంటిది? తెలంగాణ ఉద్యమంలో దానికి ఉన్న ప్రాధాన్యత ఏమిటి? పవిత్రత ఏమిటి? అనే కనీస అవగాహన ఉన్నదా? 2009లో కేంద్రం తెలంగాణ ప్రకటన చేయడానికి దారితీసిన సందర్భం అది. ఆ ప్రకటన రావడానికి కారణమైన కేసీఆర్ దీక్ష సందర్భంగా జరిగిన ఘటన అది. తెలంగాణ సమాజం ఉవ్వెత్తున లేచి జై తెలంగాణ అని ముక్తకంఠంతో నినదించిన పవిత్ర సందర్భమది. అలాంటి సందర్భాన్ని కొంచెపు బుద్ధులతో కురుచ మనస్తత్వాలతో అవమానిస్తారా? బలిదానాలను కించపరుస్తారా? 'ఉద్యమకారులకు అన్యాయం జరుగుతోంది. మేమొస్తే అది చేస్తాం.. ఇది చేస్తాం' అంటూ మీరు కార్చిన మొసలి కన్నీటి వెనక ఉన్న అసలు స్వరూపం ఇదా? ఏ సందర్భాన్ని ఎలా చూడాలో కూడా తెలియదా? తెలంగాణ వాదానికి, తెలంగాణ బలిదానాలకు మీరిచ్చే విలువ ఇదా? ఇప్పుడు మీరెక్కిన పీఠాలు, అనుభవిస్తున్న రాజభోగాలూ అన్నీ ఆ బలిదానాల ఫలిత మన్న విషయం కూడా సోయి లేకుండా మరిచిపోతారా?

> ఇంతకూ హరీశ్‌రావుపై నీలాపనిందలు వేసిన ఆ సందర్భం ఏమిటి? ఆ సంఘటన ఏమిటి? తెలంగాణ రాష్ట్ర సాధనకోసం 'తెలంగాణ వచ్చుడో, కేసీఆర్ సచ్చుడో' అనే నినాదంతో కేసీఆర్ ఆమరణ దీక్ష చేపడుతున్నట్టు ప్రకటించారు. ఇందు కోసం ఆయన ఎంచుకున్న వేదిక సిద్దిపేట సమీపంలోని రంగధాంపల్లి దీక్షా శిబిరం.

జనాన్ని పెద్ద ఎత్తున తరలించడానికి ఆయన ఎంచుకున్న వ్యూహం ప్రకారం అంతకు ముందురోజు ఆయన కరీంనగర్ తెలంగాణ భవన్‌లో విశ్రాంతి తీసుకొని అక్కడినుంచి బయలుదేరి దీక్షా వేదికకు చేరుకోవాలి. ప్రభుత్వం ఈ దీక్షను వీలైనంత తొందరగా భగ్నం చేయడానికి శతవిధాలా ప్రయత్నిస్తుందని తెలుసు. ఇది ఆమరణ దీక్ష కాబట్టి సర్వశక్తులూ ఒడ్డి ఎట్టి పరిస్థితిలోనూ దీక్ష భగ్నం కాకుండా చూసుకోవాలి. అందుకే దుర్భేద్యంగా దీక్షా శిబిరం ఉండాలని దానికి తగ్గట్టు వ్యూహం ఎంచుకున్నారు. ఒకసారి కేసీఆర్ దీక్షాశిబిరంలో కూర్చుంటే ఇక ఎన్ని పోలీసులు బలగాలు వచ్చినా ఆయన సమీపానికి కూడా చేరుకోకుండా అనేక వలయాలుగా వలంటీర్లు, కార్యకర్తలను మోహరించే ఇన్‌చార్జ్ బాధ్యత హరీష్ రావుకు అప్పగించారు. ఇది పూర్వరంగం.

కేసీఆర్ ఒకసారి రంగధాంపల్లి శిబిరానికి చేరుకుంటే దీక్ష భగ్నం చేయడం అసాధ్యమని ప్రభుత్వం భావించింది. కరీంనగర్‌నుంచి ఆయన పెద్ద కాన్వాయ్‌తో బయలుదేరగానే ఒక వ్యూహం ప్రకారం ఒక్కో వాహనాన్ని పక్కకు తప్పించి కేసీఆర్‌ను అదుపులోకి తీసుకొని ఖమ్మం తరలించింది. ఈ వార్త వినగానే అదే శిబిరంలో హరీశ్‌రావు బృందం ఆగ్రహించి ఆమరణ దీక్షలు ప్రారంభించింది. దీంతో ఈ దీక్షాశిబిరాన్ని విచ్ఛిన్నం చేయడానికి మఫ్టీ పోలీసులు కార్యకర్తల్లో కలిసి పోయి రక్షణ వలయాలు దాటుకొని ముందుకు వచ్చారు. అలా వేదికను చేరుకుంటున్న క్రమంలో కిరోసిన్ బాటిళ్లతో చుట్టూ కూర్చున్న కార్యకర్తలు పోలీసులను ముందుకు రావద్దని హెచ్చరించారు. ఈ సమయంలోనే హరీశ్‌రావు పక్కనున్న కార్యకర్త చేతిలోంచి కిరోసిన్ బాటిల్ తీసుకొని పోలీసులు ముందుకు వస్తే ఆత్మహత్యకు పాల్పడతానని హెచ్చరించారు. అయితే అప్పటికే పోలీసులు వేదికను నలువైపులనుంచి చుట్టుముట్టి తీవ్రమైన తోపులాటల మధ్య హరీశ్‌రావును అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఇదీ జరిగింది.

ఈ సంఘటనను ఆధారంగా చేసుకొని అగ్గిపెట్టె దొరకలేదా? అని ఒకడు? దీని స్ఫూర్తితోనే విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని మరొకడు నీచప్రచారాలకు దిగారు. రాజకీయ దుగ్ధతో ఇతర పక్షాల నాయకులు కూడా దాన్నే ఇంకా.. ఇంకా మోస్తున్నారు.

కానీ హరీశ్‌రావు అక్కడికి ఎందుకు వచ్చారు? దీక్షాశిబిరం నిర్వహణకోసం వచ్చారు. కేసీఆర్ కాన్వాయ్‌తో వచ్చి దీక్షావేదికపై కూర్చుంటారు... ఆయనకు రక్షణ కల్పించి దీక్షకు ఆటంకం కలగకుండా చూడాలనే తప్ప మరో ఆలోచన అప్పటికి ఆయనలో లేదు. అందుకే ఆయన ఇంటి నుంచి కిరోసిన్ బాటిల్ తెచ్చుకోలేదు. కాబట్టి అగ్గిపెట్టెకూడా తెచ్చుకోలేదు. అసలు అలాంటి సందర్భం ఎదురవుతుందనీ ఆయన ఊహలోనే లేదు. అంతా అనుకున్నదానికి భిన్నంగా జరిగిన నేపథ్యంలో పోలీసులు దీక్షా శిబిరాన్ని ఆక్రమించుకోవడాన్ని నివారించేందుకు కార్యకర్త చేతిలోంచి కిరోసిన్ బాటిల్ తీసుకుని ఒంటిపై చల్లుకున్నారు. అదొక ప్రొటెస్ట్. దీనికి అగ్గిపెట్టె తెచ్చుకోలేదా? అగ్గిపుల్లలు దొరకలేదా? వంటి వెకిలి ఆరోపణలు.

ఇక ఈ సంఘటన కారణంగానే విద్యార్థులు ఆత్మహత్యల పాలైనట్టు వక్రీకరణలు. దేశ చరిత్రలో, రాష్ట్ర చరిత్రలో ఎక్కడా, ఏనాడూ కిరోసిన్ చల్లుకొని ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు జరుగలేదా? కేంద్రంలో వీపీసింగ్ ఓబీసీ రిజర్వేషన్లు అమలు చేసినపుడు దేశంలో అనేక రాష్ట్రాల్లో డజన్ల కొద్దీ విద్యార్థులు నిలువునా కాల్చుకొని చనిపోలేదా? ఇపుడంటే లేవుగానీ 70,80 దశకాల్లో గృహహింస భరించలేక ఎంతోమంది మహిళలు కిరోసిన్ చల్లుకొని చనిపోయిన సంఘటనలు జరుగుతూనే ఉండేవి.

ఆనాటి పరిస్థితి ఏమిటి? కేసీఆర్ ఆమరణ దీక్ష ప్రకటన యువతలో తీవ్ర ఉద్వేగాన్ని సృష్టించింది. ఎన్నో ఏండ్లుగా ప్రజల్లో రగులుతున్న తెలంగాణవాదం పెనువిస్ఫోటనమైంది. ఈసారి సాధించే తీరాలి అనే కసి, పట్టుదల ప్రజల్లో బలంగా నాటుకుంది. అంతేకాదు.. ఈ దీక్షతో తెలంగాణ వచ్చితీరుతుందనే గట్టినమ్మకం సర్వత్రా వ్యాపించింది. ఈ క్రమంలో కేసీఆర్ అరెస్టు వార్తతో కుంగిపోయి శ్రీకాంతాచారి ఆత్మాహుతికి పాల్పడ్డాడు. తన బలిదానం తెలంగాణ ఉద్యమాన్ని ప్రజ్వరిల్ల చేయాలనేది ఆయన ఆకాంక్ష. అంతే తప్ప ఏదో సంఘటన స్ఫూర్తి కాదు.. అనుకరణ అసలే కాదు. అది నిష్కల్మషమైన బలిదానం. మహోన్నతమైన ఆత్మత్యాగం.

> ప్రభుత్వ బలగాలతో తెలంగాణవాదాన్ని తొక్కేయాలనుకున్న మూకలకు ఈ బలిదానాలు మింగుడు పడలేదు. వీటిని ఎలా ఎదుర్కోవాలో అర్థం కాలేదు. ఈ క్రమంలో వీటిని పలుచన చేయడానికి ఎంచుకున్న నీచ ప్రచారం ఈ అగ్గిపెట్టె వ్యాఖ్యానం. ఈ వాస్తవాన్ని విస్మరించి ఉద్యమాన్ని దెబ్బకొట్టేందుకు పచ్చమూక తయారుచేసిన నిందలను నిండు తెలంగాణ సభలో ప్రవచించడం ఏం సభ్యత? ఏం సంస్కారం? పైగా విద్యార్థుల బలిదానాలు చూసి సోనియమ్మ తెలంగాణ ఇచ్చింది..అన్నది వీళ్లే. మరోవైపు ఆ బలిదానాలను వక్రించేది వీళ్లే.

ఇవాళ తెలంగాణ ఎలాంటి శక్తుల చేతుల్లోకి వెళ్లిందో.. ఎలాంటి లాబీల బానిసల చేతుల్లో మగ్గబోతుందో వాళ్ల వ్యాఖ్యలు, వ్యాఖ్యానాలు, రంకెలు, హుంకరిపులు తేట తెల్లం చేస్తున్నాయి. గతంలో ఒక మిత్రుడు ఇదే పత్రికలో రాసిన ఒక వ్యాసంలో చెప్పాడు.. 'తెలంగాణను వ్యతిరేకించే శక్తులే నీకు తెలియకుండానే ఉద్యమంలో చేరి నీకంటే ఎక్కువగా జై తెలంగాణ అని అరుస్తాయి. ఆవేశపడుతాయి. వాళ్లను దూరం పెట్టకపోతే తెలంగాణను.. తెలంగాణవాదాన్ని భూస్థాపితం చేస్తాయి..' అని. సరిగ్గా అదే ఇపుడు కండ్లముందు కనిపిస్తున్నది. తెలంగాణ అస్తిత్వ చిహ్నాల మార్పు..